క్లుప్తంగా

'ప్రభుత్వ కళాశాలలో చేరండి'

మహమ్మదాబాద్: ఇటీవలె కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరాలని కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన విద్యావంతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గండీడ్, మహమ్మదాబాద్, హన్వాడ మండలాలకు సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించే ప్రయత్నం ప్రతీ ఒక్కరూ చేయాలని తెలిపారు. కళాశాలలో అనుభవజ్ఞులైన లెక్చరర్లు సిబ్బంది బోధన చేస్తారని ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో తెలుగు ఆంగ్లమాధ్యమాల్లో బోధన చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎస్ఎస్‌సీ నెట్ మెమో ఆధార్ జిరాక్స్‌లను ఇచ్చి అడ్మిషన్ పొందవచ్చన్నారు. అందుకు ఆయా గ్రామాల్లో విద్యావంతులు విద్యార్థులకు తగిన అవగాహన కల్పించాలని కోరారు.

నులి పురుగుల నివారణకు చర్యలు

గండీడ్: నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గండీడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈనెల 20న జరగనున్న ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత సబ్‌సెంటర్ల ద్వారా ఈ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఉదయమే దొడ్డలోనిపల్లి, మోతీనగర్, రాజేంద్రనగర్, న్యూటౌన్ తదితర ప్రాంతాల్లో తనిఖీ చేసి పారిశుద్ధ్య సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పెద్దనాలాలు, గల్లీలలోని డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. ఎక్కడా మురుగు నిల్వ ఉండకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

మైసమ్మకు ప్రత్యేకపూజలు



జడ్చర్ల టౌన్: జాతీయరహదారి 44 నంబరుపై కావేరమ్మపేట వద్ద ఉన్న బంగారుమైసమ్మ ఆలయంలో మంగళవారం పురస్కరించుకుని భక్తులు బోనాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నైవేద్యాలు సమర్పించి అన్నదానం జరిపించారు. కావేరమ్మపేట, జడ్చర్ల అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అంటువ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

నవాబుపేట: అంటువ్యాధుల విషయంలో జనం అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి నవీన్‌చంద్ర తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం కావటంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు పరిశుభ్రత పాటించాలని సూచించారు. గ్రామాల్లోని వైద్య సిబ్బంది ప్రజలకు తగు సూచనలు చేయాలని తెలిపారు. పారిశుద్ధ్యానికి సంబంధించి ప్రజలకు కరపత్రాలు, సామాజిక మాధ్యమాల ద్వారా సూచనలు చేయాలని వివరించారు.

'నీట్' పై విచారణ జరిపించాలి

మరికల్: నీట్ ప్రవేశ పరీక్షలో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని చౌరస్తాలో నిరసన నిర్వహించారు. ఎంసీయూఐ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫలితాలు అడ్డగోలుగా విడుదల చేయడంతో మార్కులు తక్కువగా రావడం జరిగిందన్నారు. విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నట్లు వాపోయారు. పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సహకారం బహుదూరం

- సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, యంత్రాల ఊసేలేదు
- ఐదేళ్లుగా రైతులకు అవస్థలు
- కొత్త ప్రభుత్వం పైనే రైతుల ఆశలు



ట్రాక్టర్‌తో పొలం సిద్ధం చేస్తున్న రైతు



పారుపల్లిలో పొలం సిద్ధం చేస్తున్న రైతు

కోయిల్‌కొండ: వ్యవసాయమే జీవనోపాధిగా ఎంచుకున్న రైతులకు గత ప్రభుత్వంలో సహకారం కొరవడింది. సాగు పరికరాలు, యంత్రాలపై రాయితీ ఎత్తివేయడంతో చిన్న, సన్నకారు రైతులకు సాగు కష్టతరంగా మారింది. వెన్నంటి ఉండే సహకార సంఘాల ప్రోత్సాహం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాయితీపై సరఫరా చేసే సాగు సామగ్రి తదితరాల కోసం ఐదేళ్లుగా ఎదురుచూపులే మిగిలాయంటున్నారు. ఏటా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా సబ్సిడీపై అందజేసే యంత్రాలు, యంత్ర పరికరాలు, ఎరువులు, విత్తనాల ఊసే లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కనీసం కొత్త ప్రభుత్వమైనా తమ వైపు చూడాలని.. సాగుకు సహకారం అందించాలని కోరుతున్నారు.

కాగా కోయిల్‌కొండ మండలంలో దాదాపు 29వేల మంది రైతులు ఉన్నారు. వర్షాకాలంలో 32వేల ఎకరాల్లో వరి, జొన్న, కంది, పత్తి తదితర పంటలు సాగుచేస్తుంటారు. కాగా సాగుకు సంబంధించిన సహకారంపై ఇప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటరుణాలు ఇవ్వడం, తిరిగి తీసుకోవడం, ధాన్యం కొనుగోళ్ల వరకే పరిమితమయ్యాయని రైతులు చెబుతున్నారు. ఇక ఇదివరకు సహకార సంఘాలు సాగు పద్ధతులు, అవసరమైన యంత్రపరికరాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై తదితరాల్లో రైతులకు అండగా ఉండేవి. కానీ ఐదేళ్లుగా సొసైటీలు అవేవి ఇవ్వడం లేదు. వాటిపై ప్రభుత్వం రాయితీ ఎత్తివేసింది. దీంతో మండల పరిధిలోని రైతులు తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. నాణ్యతలేని ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ నష్టపోతున్నారు. పంట ఉత్పత్తులను విక్రయిస్తే వచ్చే ఆదాయం కంటే ఖర్చు అధికం కావడంతో అన్నదాతలు అప్పుల పాలవుతున్నారు. సహకార సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు కొరవడి రైతులు నష్టపోతున్నారు. ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసి అధిక దిగుబడి, సేంద్రియ సేద్యం, వాటి పద్ధతులు, ఎరువుల వాడకం లాభసాటిపంటలు తదితర అంశాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా ఆధునాతన సాగు పరికరాలు, యంత్రాలు, ట్రాక్టర్లు, పంపుసెట్లు తదితర వాటి ధరలు రూ. లక్షల్లో ఉంటాయని.. వాటిని సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసి కనీసం అద్దెకు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.


విత్తనాలు అందించాలి..



మార్కెట్‌లో నకిలీ విత్తనాల దందా ఎక్కువగా ఉంది. చిన్న, సన్నకారు రైతులు అప్పులు తెచ్చి వ్యాపారుల మాటలు నమ్మి నాసిరకం విత్తనాలు కొనుక్కోవాల్సి వస్తుంది. దీంతో దిగుబడి లేక నష్టపోతున్నాం. వ్యవసాయ అధికారుల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలి.

– ఆశిరెడ్డి, రైతు, వింజామూర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు ఎప్పటికప్పుడు షాపులను తనిఖీలు చేస్తున్నాం. ఇక యంత్ర పరికరాలు రైతులకు సబ్సిడీతో అందించే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– రాంపాల్, వ్యవసాయాధికారి, కోయిల్‌కొండ.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

జడ్చర్ల టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి మున్సిపల్ కార్మికులు వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సేవలను థర్డ్‌పార్టీకి అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా చూడాలని విన్నవించారు. అదేవిధంగా స్థానికంగా అనేక సమస్యలు ఉన్నాయని పరిష్కరించాలని కోరారు. కాగా స్పందించిన ఎమ్మెల్యే రెండు మూడు రోజుల్లో కార్మికులతో కలసి సహపంక్తి భోజనాలు చేసేందుకు వస్తానని, అప్పుడు సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు మహేష్, కృష్ణ, అలివేలు, అంజమ్మ, కేశవులు, విజయ్‌కుమార్, యాదయ్య, కరీం, జయమ్మ, అనురాధ, అనూష, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి గుంతలోపడ్డ ట్యాంకర్

- ఇద్దరికి తీవ్రగాయాలు



రాజాపూర్: మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి శివారులో జాతీయ రహదారిపై మంగళవారం ఓ ఖాళీ పెట్రోల్ ట్యాంకర్ అదుపుతప్పి రోడ్డుపక్కన గుంతలో పడిపోయింది. కాగా జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొట్టడంతో ఘటన చోటుచేసుకుంది. ఘటనలో డ్రైవర్ హుస్సేన్‌తో పాటు అందులో ఉన్న మరో మహిళకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి వారిని అంబులెన్స్‌లో జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దోమల నివారణకు ఫాగింగ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 7, 8వ వార్డుల పరిధిలో దోమల నివారణకు మంగళవారం రాత్రి మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. ముఖ్యంగా పద్మావతీకాలనీ, టీచర్స్‌కాలనీ తదితర ప్రాంతాలలో ప్రత్యేక వాహనం ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించారు.

టమాట @100

- సెంచరీ కొట్టిన పచ్చిమిర్చి



టమాట

అడ్డాకుల: మండల పరిధిలో కూరగాయలు సామాన్యులు కొనలేని విధంగా రూ.వందల్లో ధరపలుకుతున్నాయి. వారాంతపు కూరగాయల సంతలో ధరలను చూసి సామాన్యులు అరకిలో, పావుకిలో తోపే కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో జరిగే సంతల్లో రెండు వారాల నుంచి కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. మంగళవారం మూసాపేట సంతలో కిలో టమాట ధర సెంచరీ(రూ.100)కి చేరింది. కిలో పచ్చిమిర్చి ధర కూడా రూ.100 దాటడంతో కొనుగోలుదారులు అవాక్కవుతున్నారు. ఇవేం ధరలు బాబోయ్ అంటూ బిక్కమొహాలేస్తున్నారు. ఇక వంకాయలు, బెండకాయలు, బీరకాయల ధరలు కిలోకు రూ.80 వరకు చేరాయి. వారాంతపు సంతల్లో కూరగాయల ధరలు ప్రతి ఏడాది జూన్, జూలై నెలలో పెరగడం సాధారణమైంది. ఈ సీజన్‌లో కూరగాయల ఉత్పత్తి తగ్గడంతో మార్కెట్లలో ధరలు పెరగడంతో సంతల్లోనూ ఇదే పరిస్థితి ఉందని కూరగాయాల వ్యాపారులు పేర్కొంటున్నారు.

జడ్చర్లలోనూ అదే పరిస్థితి..

జడ్చర్ల టౌన్: అనుకున్నట్లే టమాట ధరలు క్రమ క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. మంగళవారం జడ్చర్లలో కిలో టమాట రూ.100కు పెరిగింది. నాలుగు రోజుల కిందటి వరకు కిలో టమాట రూ.50–70మధ్యలో ఉండగా మూడురోజుల్లోనే రూ.100కు చేరింది. వర్షాకాలం ఆరంభం కావటంతో స్థానికంగా టమాట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. శంషాబాద్, షాద్‌నగర్ మార్కెట్ల నుంచి టమాట రావటం లేదు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి టమాట దిగుమతి చేసుకుంటున్నారు. ఈ కారణంగా ధరలు మండిపోతున్నాయి. మంగళవారం కూరగాయలు కొనేందుకు వెళ్లిన వారు టమాట ధర విని అవాక్కయ్యారు. నిన్న మొన్నటి వరకు రూ.50–70 గా ఉండగా ఇప్పుడు కిలో రూ.100కి చేరటంతో కిలో కొనేవారు అరకిలోతో సరిపెట్టుకుంటున్నారు. మరి కొద్ది రోజుల్లో కిలో రూ.150కి చేరవచ్చని వ్యాపారులు చెబుతున్నారు.

మూసాపేట సంతలో పరిస్థితి ఇలా..

కూరగాయల	కిలో ధర
టమాట	రూ.100
పచ్చిమిర్చి	రూ.100
బెండకాయలు	రూ.80
బీరకాయలు	రూ.85
క్యారెట్	రూ.80
దొండకాయలు	రూ.60

వరద కాల్వపై ప్రహరీ

- పోలీసుల సాయంతో తొలగింపజేసిన మున్సిపల్ అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక నవాబుపేట రోడ్డులోని వరదకాల్వపై ఓ వ్యక్తి గతంలో అడ్డంగా నిర్మించిన ప్రహరీని మంగళవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. వాస్తవానికి వానగట్టు సమీపం నుంచి వర్షాకాలంలో వరద ఈ కాల్వ గుండా ప్రవహించి మోతీనగర్, సుభాష్‌నగర్, పాత కలెక్టరేట్ మీదుగా పెద్దచెరువు వరకు వెళ్తుంది. అయితే కొన్నేళ్ల క్రితం సమీపంలోని ఓ వ్యక్తి తన స్థలంతో పాటు ఈ కాల్వపై ప్రహరీ నిర్మించారు. విషయమై స్థానికుల ఫిర్యాదు మేరకు తాజాగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. అక్కడికి వెళ్లగా సంబంధిత వ్యక్తి కుటుంబ సభ్యులు కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు. చివరకు పోలీసుల రక్షణ మధ్య జేసీబీతో కాల్వను పునరుద్ధరించారు. టీపీఓ లక్ష్మీపతి, టీపీఎస్ లక్ష్మీప్రసన్న, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి, మహబూబ్‌నగర్ అర్బన్ మండల సర్వేయర్ రఘు తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల రక్షణ మధ్య వరదకాల్వను పునరుద్ధరిస్తున్న మున్సిపల్ అధికారులు

'జీఓ 2 రద్దు చేయాలని డీఈఓకు వినతి'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉపాధ్యాయ పదోన్నతుల్లో డేట్ ఆఫ్ అక్వయిరింగ్‌ను తొలగించాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం (టీజీయూఎస్) జిల్లా అధ్యక్షుడు పి.తారాసింగ్, ప్రధాన కార్యదర్శి కె.హీరాలాల్ రథోడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డైట్ కళాశాల ఆవరణలో డీఈఓ రవీందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ అన్‌–ట్రెయిన్డ్ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించడంలో ఇది పెద్ద ఆటంకంగా మారిందన్నారు. ముఖ్యంగా జీఓ నం.2ను రద్దు చేయాలన్నారు. సాధారణ సీనియారిటీ పొందినప్పటికీ ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ కోటా కింద పరిగణించడం వల్ల పదోన్నతి అందని ద్రాక్షగా మారిందన్నారు. ఉద్యోగంలో చేరిన రోజును పరిగణలోకి తీసుకుని తదుపరి పదోన్నతి కల్పించాలన్నారు. కాగా, అంతకుముందు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వారు నల్ల బ్యాడ్జీలు ధరించి కొద్దిసేపు ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వర్ధమాన్ బాలవీర్ తోపాటు టీజీయూఎస్ నాయకులు పాల్గొన్నారు.

జడ్చర్ల: మండల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. నార్య నాయక్, కృష్ణా నాయక్, మధు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద వద్ద నిర్వహించిన ధర్నాలో.. టీజీయూఎస్‌రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నాయక్ పాల్గొని మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు తారాసింగ్, మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్, మహిళా ఉపాధ్యాయులు శోభ, రాధిక పాల్గొన్నారు.

కూలీలకు పెండింగ్ డబ్బులు చెల్లించాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు

జడ్చర్ల టౌన్: ఉపాధి కూలీలకు పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్ రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కూలీల సమస్యలను పరిష్కరించాలని, మేట్ల వ్యవస్థ కొనసాగించాలని, సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలన్నారు. పనిదినాలను 200 పెంచి దినసరి కూలి రూ.600 ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. వారం వారం కూలి డబ్బులు చెల్లించాలని, ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు ఇవ్వాలన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. వాస్తవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో వేతనాలు ఇవ్వకుండా కూలీలను పనికి దూరం చేసే దుర్మార్గపు చర్యకు పూనుకుంటున్నాయని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ధర్నాలో భాగంగా ఎంపీడీఓ వెంకట్‌ప్రసాద్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పోలె జగన్, మండల నాయకులు, కూలీలు గోపె నర్సింహులు, జయరాములు, యాదయ్య, బాలమణి, అంజమ్మ, చంద్రకళ, గప్పి, ముత్యాలు, మని, మైసమ్మ పాల్గొన్నారు.

జోరుగా మొక్కలు నాటే పనులు



దేవరకద్రలో కోయిల్‌సాగర్ రహదారి వెంట..



కామారం గుంతలు తీస్తున్న ఉపాధికూలీలు

నవాబుపేట: గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ఉపాధి కూలీల సాయంతో సిబ్బంది పనులు ప్రారంభించారు. కామారంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీయటం ముమ్మరం చేశారు. గ్రామంలోని నర్సరీలో దాదాపుగా 40 వేల మొక్కలను పెంచినట్లు.. వాటిని రైతుల పొలాలతో పాటు, గ్రామంలో ఇళ్ల ముందు, అలాగే రోడ్డుకు ఇరువైపుల రెండో వరసలో నాటేలా చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతి కార్యదర్శి క్రాంతి తెలిపారు. కాగా మండలంలోని రుద్రారం, పోమాల్, నవాబుపేట, కొండాపూర్, ఇప్పటూర్ గ్రామాల్లో మొక్కలు నాటేందుకు గోతులు తీసే కార్యక్రమం ముమ్మరం చేశారు.

దేవరకద్ర: మండల కేంద్రం నుంచి కోయిల్‌సాగర్ వెళ్లే రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద రహదారి పక్కన గుంతలు తవ్వి మొక్కలను నాటారు. అదేవిధంగా అమ్మాపూర్ రోడ్, మహబూబ్‌నగర్ రోడ్‌ల పక్కన పెద్ద ఎత్తున మొక్కలను నాటారు. దేవరకద్ర పెద్ద చెరువు కింద పంట కాల్వల్లో పూడిక తీసే పనులు ఉపాధి పథకం కింద కూలీలతో చేయిస్తున్నారు.

నల్లా కనెక్షన్‌లపై ఇంటింటి సర్వే



దేవరకద్ర: మండల కేంద్రంలో మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి ఇచ్చిన నల్లా కనెక్షన్‌లపై మంగళవారం సర్వే నిర్వహించారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు, అంగన్‌వాడీ టీచర్లు ఈ సర్వేలో పాల్గొన్నారు. నల్లా కనెక్షన్ ఉన్న వారివి, లేని వారి వివరాలను నమోదు చేశారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో సర్వేను గ్రూపులుగా తిరిగి నిర్వహించారు.

రెండు రోజుల్లో పూర్తిచేయకపోతే చర్యలు..

నవాబుపేట: రెండు రోజుల్లో మిషన్ భగీరథ నల్లాల సర్వేపూర్తి చేసి సమగ్ర సమాచారం అందించాలని.. నిర్లక్ష్యం చేస్తే పంచాయతీ సిబ్బందిపై చర్యలు ఉంటాయని ఈఓపీఆర్‌డీ బద్రునాయక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం సర్వే గడువు ఈ నెల 20 వరకు మాత్రమే ఉందన్నారు. అంతలోగా వందశాతం సర్వే పూర్తి కావాల్సి ఉందని వివరించారు. మండలంలో మొత్తం 16,714 మిషన్ భగీరథ నల్లాలు ఉన్నాయని వాటిలో నేటికి పంచాయతీ సిబ్బంది 13,559 నల్లాల సర్వే పూర్తి చేశారన్నారు. మిగతా 3155 నల్లాల సర్వేను పూర్తి చేసి రెండు రోజుల్లో వివరాలు అందించాలని ఆయన సూచించారు.